క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. సమావేశం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు. వివిధ శాఖల ఉద్యోగులకు వారి శాఖల నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

రైవాడ యోగాంధ్ర కార్యక్రమం వాయిదా

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం వద్ద బుధవారం నిర్వహించాల్సిన యోగాంధ్ర కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం నుండి ఏకధాటిగా మోస్తరు వర్షం కురుస్తుండడంతో అక్కడి పరిసరాలు చిత్తడిగా మారి యోగా చేసేందుకు అనుకూలంగా లేక పోవడంతో వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. మరలా ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహిస్తామన్నది త్వరలో ప్రకటిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


నాగయ్యపేటలో మొక్కలు నాటుతున్న త్రినాథరాజు తదితరులు

దేవరాపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో వాటి సంరక్షించాలని ఆదర్శ వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు బి.త్రినాథరాజు అన్నారు. మండలంలోని నాగయ్యపేట గ్రామంలో పర్యావరణ పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకోని వనం-మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక డ్వాక్రా మహిళలతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జామి ఉమా మంగబాబు, జామి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాలు


శ్రీలక్ష్మిగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

నాతవరం: ఇందిరమ్మ మోడల్ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మిగణపతి ఆలయంలో మంగళవారం ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా తీర్థ పసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలతో భజనలు, కోలాటం ఏర్పాటు చేశారు.

యోగా దినచర్యలో భాగం కావాలి


కె.కోటపాడులో యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అయ్యన్న విద్యాసంస్థల్లో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు బండారు వెంకట రమణమూర్తి యోగాసనాలను వేయించారు.

127 స్పౌజ్ పింఛన్లు మంజూరు

మాడుగుల : మండలంలో 23 సచివాలయాల్లో 127 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ పింఛన్లు ఈ నెలాఖరులోపు అందజేస్తామన్నారు. అవురువాడ సచివాలయానికి 6, గొటివాడ అగ్రహారానికి 5, జాలంపల్లికి, 9 జమ్మాదేవిపేటకు 7, కస్పా జగన్నాథపురం-1కి -8, కస్పా జగన్నాథపురం-2కు -1, కింతలి వల్లాపురానికి -2, లోవపాన్నవోలు 3, మాడుగుల-1కు 2, మాడుగుల-2కు 11, మాడుగుల-3కు 9 ఎం.కోడూరు 5, ఎం. కోటపాడు -6, ముకుందపురం, 4, పొంగలిపాక, 3, పోతనపూడి -6, సాగరం,-10, శంకరం-6, సత్యవరం, -6, తాటిపర్తి,-2, వీరనారాయణం-5, వీరవల్లి అగ్రహారానికి, 3, వొమ్మలికి-8 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఎంపీడీవో తెలిపారు.

ఖరీఫ్ సాగుకు వడివడిగా..


కంచుగుమల్లో వేసవి దుక్కులు చేసుకున్న రైతులు


రోలుగుంటలో పంట భూమిలో సిద్ధం చేసుకున్న ఆకుమడి

- మృగశిర కార్తె ప్రారంభం, చల్లబడిన వాతావరణం
- వరి నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు
- వరి విత్తనాల కోసం నమోదుకు సన్నాహాలు

రోలుగుంట : మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మండల రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. మండలంలో వ్యవసాయాధికారుల సూచనలు సలహాల మేరకు గత నెలలోనే ఖరీఫ్ సాగు కోసం వేసవి దుక్కులు చేసుకున్నారు. నారు మడులు కూడా సిద్ధం చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గతేడాది ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 1341 హెక్టార్లు కాగా 1847 హెక్టార్లలో వరి సాగయింది. మండలంలో అన్ని రైతు సేవాకేంద్రాల పరిధిలో రైతులకు అన్ని రకాల వరి విత్తనాలను 1341 క్వింటాళ్లు ప్రభుత్వ రాయితీపై రైతులకు పంపిణీ చేశారు.

ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 1341 హెక్టార్లు. కాగా చెరకుకు టన్ను మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు సరుగుడు, వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతేడాది మాదిరిగానే వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈ మేరకు రైతులకు విత్తనాలు సరఫరా కోసం నిర్ణయించింది. అలాగే భూసారం అభివృద్ధి కోసం జనుము, జీలుగు విత్తనాలను కూడా పంపిణీ చేశారు. ఇప్పటికే మండలంలో గల అన్ని గ్రామాల్లోను వేసవి దుక్కులు చేసుకున్నారు. గత నెలలో కురిసిన అనుకూల వర్షాలకు ఈ నెల మొదటి వారం నుంచి రోలుగుంట, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు. శరభవరం తదితర గ్రామాల్లో రేండేసి దఫాలు దుక్కు చేసి రైతులు ఆకుమడులు సిద్ధం చేసుకున్నారు. కొమరలోవ అవ, శరభవరం పెదచెరువు, బుచ్చింపేట చెరువుల వద్ద సమీపంలో గల భూముల్లో పదునుగా ఉండడంతో ఆకుమడులు తయారీకి కొంత ఇబ్బందిగా ఉందని, భూమి ఆరేకా సిద్ధం చేసుకుంటామని, అలాగే ఈ నెలాఖరున ప్రతి ఏడాది మాదిరిగానే వరిఆకు వేసుకోనున్నట్టు రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగులో భాగంగా గత నెలలోనే వేసవి దుక్కులు చేసుకున్నామని, అలాగే దుక్కులో పశువుల ఎరువులు (గెత్తం) పాత సాగు విధానం పాటిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం



ఆశించిన పంట దిగుబడి, భూసారం అభివృద్ధికి పచ్చిరొట్ట విత్తనాలు మేలు చేస్తాయి. వ్యవసాయ కార్యాలయంలో జీలుగు విత్తనాలు తీసుకొని భూమిలో విత్తనాలు చల్లడం జరిగింది.

– పారువల్లి అప్పలనాయుడు, రైతు, రోలుగుంట

త్వరలోనే విత్తనాల రిజిస్ట్రేషన్



ఖరీఫ్ సాగుకు రైతులకు విత్తనాల సరఫరా కోసం అవసరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. రైతుల నుంచి వారి వివరాల నమోదు కోసం అధార్ కార్డు, పాస్‌బుక్ జెరాక్సు కాపీలను తీసుకోవడం జరుగుతుంది. ఖరీఫ్ సాగుకు రైతులు విధిగా వ్యవసాయ సూచనలు పాటించాలి.

– ఎస్.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి, రోలుగుంట

కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది


రోలుగుంటలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హైమ, రమ్య, అంగన్‌వాడీ వర్కర్లు


కె.కోటపాడులో కిశోర బాలికలతో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న కుమారి, తదితరులు

రోలుగుంట : కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాదిలాంటిదని ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మే 2 న ప్రారంభమైన 'కిశోరి వికాసం' కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలో గల బుచ్చింపేట, రోలుగుంట సూపర్‌వైజర్లు రమ్య, హైమ మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో అంగన్‌వాడీ వర్కర్లకు కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు కార్యక్రమం ఉద్దేశ్యం, దీనివల్ల కిశోర బాలికలు మేలు గురించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. దీనిలో బాల్య వివాహాలు అరికడదామని, మేనరిక వివాహాలు వద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు సౌజన్య, వరలక్ష్మి, సరళ పాల్గొన్నారు.

కె.కోటపాడు : కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని కె.కోటపాడు అంగన్‌వాడీ కార్యకర్త డోకల కుమారి అన్నారు. కె.కోటపాడులో మంగళవారం కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న అనుబంధ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ఆకుకూరలు, పప్పుదినుసులతో కూడిన ఆహారంను తీసుకోవాలని సూచించారు.

బాలికలకు విద్యే ప్రధానం


ఏఎల్‌పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గొలుగొండ : నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని దీని కోసం బాలికులు చదువులపై దృష్టి పెట్టాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి తెలిపారు. ఈ సందర్భంగా ఏఎల్‌పురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల బాలికలకు విద్యా విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో విద్యా హక్కు చట్టం, ప్రభుత్వం బాలికులకు కల్పిస్తున్న రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి పీవో సూచించారు. గొలుగొండ సెక్టార్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల గురించి తెలుసుకోండి


దిబ్బిడిలో మానవహారంగా ఏర్పడ్డ కిశోర బాలికలు,అధికారులు


రావికమతంలో అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ

బుచ్చెయ్యపేట : బాలికలు తమ హక్కులు,విధులు గురించి తెలుసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం కిశోర వికాసం వేసవి సెలవులు ముగింపు కార్యక్రమంలో భాగంగా దిబ్బిడిలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. బాలికలపై అఘాయిత్యాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్ గురించి వివరించారు. 18 ఏళ్లు నిండిన తరవాతే బాలికలకు వివాహాలు చేయాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

రావికమతం : బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించడమే కిశోర వికాసం కార్యక్రమం ఉద్దేశ్యమని ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు అన్నారు. కిశోర వికాసం -వేసవి సెలవుల ముగింపు సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ప్రాజెక్ట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి కిశోర బాలికలు, అంగన్‌వాడీలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌమార దశలో కిశోర బాలికలు విద్య పట్ల దృష్టి సారించాలని, ఎదిగే దశలో రక్తహీనత లేకుండా పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలతో అనర్థాలని తెలిపారు. ఎంపీడీవో వెంకన్న బాబు, ఏసీడీవో పుష్పదేవి పాల్గొన్నారు.

మండల సీడీపీఓగా మంగతాయారు



రావికమతం: రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా వి.మంగతాయారు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీడీపీఓ ఉషారాణి పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో కె.కోటపాడు ప్రాజెక్ట్‌లో సీడీపీవోగా పనిచేస్తున్న మంగతాయారును ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న పౌష్టికాహారం లబ్దిదారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో హోమాలు


వేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31 వ తేది నుంచి జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలు బుధవారంతో ముగియనున్నట్టు ఆలయ ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నాగవల్లి సంబరాలు పురస్కరించుకుని, ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రి 7 గంటలు నుంచి స్వామి వారి పుష్పంజలి సేవ, దర్పణ దర్శనం, పవళింపు సేవ, జరుగుతుందని, భక్తులు సహకారంతో చద్ది ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేంగా హోమాది కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొత్తకోటలో పారిశుధ్య చర్యలు


కొత్తకోటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

రావికమతం: మేజర్ పంచాయితీ కొత్తకోటలో పారిశుధ్యం మెరుగు పర్చే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సుమారు 15 వేల పైబడి జనాభా, 16 వార్డులతో కొత్తకోట గ్రామం విస్తరించి ఉంది. శనివారం వారపు సంత, రోజు వారి మార్కెట్‌తో పాటు విస్తరాకుల తయారీ వ్యర్థాలతో రోజూ టన్నుల కొద్దీ చెత్త పోగవుతుంది. తగినంత సిబ్బంది లేక పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారింది. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా , ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి ప్రణాళిక సిద్ధం చేసి మంగళవారం పనులు ప్రారంభించారు. డ్రైనేజీల్లో వ్యర్థాలు, బలిసిన తుప్పలు, చెట్లను తొలగించి, కాలువను శుభ్రం చేయిస్తున్నట్టు పంచాయతీ ఈవో తెలిపారు.

ఈదురుగాలులతో వర్షం


సత్యవరంలో ఈదురుగాలులలో కూడిన వర్షం కురుస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో సత్యవరం, తాటిపర్తి, అవురువాడ గ్రామాల్లో మంగళవారం సాయంకాలం ఈదురుగాలులో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. గత 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, గాలులకు సుమారు 300 ఎకరాల్లో అపరాలు సాగు దెబ్బ తిన్నాయి. ఒక వైపు ఖరీఫ్ సీజన్ రావడంతో వరి నారు మడులు సిద్ధం చేసుకోలేకపోతున్నామని, పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోలేక పోతున్నామని, పలు గ్రామాలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాడుగుల రూరల్: మృగశిర కార్తె ప్రవేశంతో మంగళవారం ఉదయం నుంచి అడపా దడపా వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం చల్లబడింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు

- లేగదూడలు, నాటు కోళ్లపై దాడి
- వీధి శునకాల నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యం


వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నాతవరం : గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో ప్రజలు బయటకు రావడానికి భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల కాలంలో ఏగ్రామంలో చూసిన కుక్కలు గుంపులుగా సంచరించి మనుషులపైనే కాకుండా పశువులపై కూడా దాడులు చేస్తున్నాయి. రెండు నెలలు వ్యవధిలోనే నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల పరిధిలో కుక్క కాటుకు సంబంధించి 56 మందికి పైగా కేసులు నమోదయ్యాయి. రాత్రి వేళల్లో వీధుల్లో ఒంటరిగా తిరగడానికి ప్రజలు భయపడుతున్నారు. గతంలో అయితే పంచాయతీ అధికారులు కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టేవారు. ఇటీవల కాలంలో దీనిపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా కుక్కలు సంచారం విపరీతంగా పెరిగిపోతుంది. గునుపూడి, గుమ్మడిగొండ, మర్రిపాలెం, శృంగవరం, ఎంబీపట్నం గ్రామాల్లో పశువుల పాకల వద్ద లేగదూడలను సైతం గాయపరిచాయి. రైతులు కల్లాల వద్ద పెంచుకునే నాటు కోళ్లను తినేస్తున్నాయి. దీంతో బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ హాల్లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యోగా నోడల్ అధికారులు ఎల్. రమణ, కె.లావణ్య తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకూ జిల్లాలో వివిధ విభాగాల్లో యోగా పోటీలు జరుగుతాయని చెప్పారు. 10 నుంచి 18 సంవత్సరాలు కలిగిన బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అంతకుముందు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు పాల్గొన్నారు.

